సాక్షి ప్రకాశం

గురువారం । 8 । ఆగస్టు । 2024



కంభం చెరువు అభివృద్ధికి కృషి

చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కంభం చెరువును ఆమె పరిశీలించారు. - 8లో..



505 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

లారీలో అక్రమంగా తరలిస్తున్న 505 బస్తాల రేషన్ బియ్యాన్ని బేస్తవారిపేట జంక్షన్‌లో బుధవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
31/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

మార్కాపురం జిల్లా ప్రకటించాలి



మాట్లాడుతున్న జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు

ఒంగోలు: మార్కాపురంను నూతన జిల్లాగా ప్రకటించాలని జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మిరియం శ్రీనివాసులు అన్నారు. స్థానిక ఎంసీఏ భవన్‌లో 139 బీసీ కులాల జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు మార్కాపురంను జిల్లా కేంద్రంగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని, ఆలస్యం చేయకుండా ముఖ్యమంత్రి వెంటనే స్పందించి మార్కాపురంను జిల్లా కేంద్రంగా చేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేసి కందుకూరు, అద్దంకిలను ప్రకాశం జిల్లాలో కలిపి ఈ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు తోరటి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ 139 బీసీ కులాల జేఏసీ చేస్తున్న కార్యక్రమానికి ఎంఆర్‌పీఎస్ తరఫున తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యాదవ జేఏసీ జిల్లా అధ్యక్షుడు చిరుమామిళ్ల గోపీకృష్ణ యాదవ్, 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓ.వెంకటయ్య, పిన్నిక శ్రీనివాసులు, దూళ్ల అప్పారావు, జంగాల బాలయ్య, బొల్లవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.



తప్పుకుంటాం.. తలొగ్గండి!

మట్టి దందా అధికార తెలుగుదేశం పార్టీలో చిచ్చురేపింది. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాపై పెత్తనం కోసం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య కుమ్ములాటలు ప్రారంభమయ్యాయి. దేవదాయశాఖ పరిధిలోని ఆలయానికి సంబంధించి భూమిలో అక్రమంగా జరుగుతున్న మట్టి తవ్వకం విషయంలో జిల్లాకు చెందిన మంత్రి, పొరుగు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అనుచరుల మధ్య తలెత్తిన వార్ పోలీస్ స్టేషన్‌లో కేసులు పెట్టుకునే వరకూ వెళ్లింది. ఈ విభేదాలు బహిర్గతం కావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- అధికార టీడీపీలో చిచ్చురేపిన గ్రావెల్ అక్రమ దందా
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ముఖ్యనేతల అనుచరుల మధ్య వివాదం
- దేవాలయ భూముల్లో మంత్రి ముఖ్య అనుచరుడు అక్రమ తవ్వకాలు
- తమ పనులకు గ్రావెల్ ఇవ్వాలంటూ ఎమ్మెల్యే అనుచరులు, ఎమ్మెల్సీ బంధువు పట్టు
- కుదరనే కుదరదు.. అన్న మంత్రి అనుచరుడు
- సస్పెండైన దేవదాయశాఖ అధికారితో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రకృతి వనరులను చెరబట్టేందుకు ముందే టీడీపీ నేతలు పథకాలు రచించారు. టీడీపీ ముఖ్య నేతల సిఫార్సులతో ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా కోసం రంగంలోకి దిగారు. కొండపి నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి అనుచరుడు, అలాగే కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అనుచరుడికి మధ్య గ్రావెల్ రవాణా విషయమై వివాదం తలెత్తింది. ఇంటూరి అనుచరుడైన వ్యక్తి కందుకూరుకు చెందిన ఎమ్మెల్సీకి బంధువు కూడా కావడంతో గ్రావెల్ వార్ గట్టిగానే సాగుతోంది. సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలో అక్రమ మైనింగ్‌కు మంత్రి తన ముఖ్య అనుచరునికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

ఎన్నికలు ముగిసి ఫలితాలు వెలువడిన నాటి నుంచే సదరు నాయకుడు అక్రమ మైనింగ్ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బంధువు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అనుచరుడు కలిసి జాతీయ రహదారి పనులకు గ్రావెల్ సప్లయ్ చేస్తున్నారు. వారికి గ్రావెల్ అవసరం కావడంతో వారి దృష్టి కూడా శానంపూడి మీద పడింది. తాము టిప్పర్లు పంపుతాం గ్రావెల్ నింపి పంపాలని వారు మంత్రి ముఖ్య అనుచరుడికి చెప్పారు. దీనికి అతను నిరాకరించడంతో ఆగ్రహించిన కందుకూరు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వర్గీయులు జేసీబీ, టిప్పర్లు తీసుకొచ్చి శానంపూడి గ్రామ పరిధిలో ఉన్న ఉలవపాడు మండలానికి చెందిన నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. టిప్పర్లలో గ్రావెల్ నింపి తరలించే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అక్కడికి నీలకంఠేశ్వరాలయ పూజారి వచ్చి టిప్పర్లను నిలువరించారు. నెల్లూరు జిల్లాకు చెందిన దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సూచనతో ఈవోకు సమాచారం ఇచ్చారు.

తమ ప్రమేయం లేకుండా కందుకూరు ఎమ్మెల్యే అనుచరుడు గ్రావెల్ తరలించడంపై ఆగ్రహించిన మంత్రి డోలా వర్గీయులు దేవస్థానం అధికారులతో కలిసి రెండు టిప్పర్లను సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావును పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మరీ ఎస్సై టి.శ్రీరామ్‌కు రెండు టిప్పర్లను అప్పగించి కేసులు నమోదు చేయించారు.

సస్పెండైన ఈఓతో ఫిర్యాదు

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఈఓ అప్పటికే సస్పెన్షన్‌లో ఉండటం గమనార్హం. ఈఓపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా దేవదాయ శాఖ ఉన్నతాధికారులు జూలై 31న సస్పెన్షన్ వేటు వేశారు. అదే రోజు రాత్రి గ్రావెల్ టిప్పర్లను వాహనాల అడ్డగింత సంఘటన చోటుచేసుకుంది. సస్పెన్షన్ వేటు పడిన ఈఓతో మంత్రి వర్గీయులు గ్రావెల్ తవ్వకం, అక్రమ తరలింపుపై పోలీసులకు ఫిర్యాదు చేయించిన వ్యవహారంపై స్థానికంగా కథలు కథలుగా చెప్పుకొంటున్నారు.

పోలీసులకు తలబొప్పి

టీడీపీ ముఖ్య నేతల మధ్య సాగుతున్న ఈ గ్రావెల్ వార్‌తో సింగరాయకొండ పోలీసులు తలపట్టుకుంటున్నారు. టిప్పర్ల వ్యవహారాన్ని సింగరాయకొండ పోలీసులు మైనింగ్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జగన్నాథరావు రూ.22,240 జరిమానా విధించారు. కందుకూరు టీడీపీ ముఖ్య నేతలు తమ వాహనాలను వదిలేయాలని మంత్రికి చెప్పడం.. ఈ మేరకు మంత్రి నుంచి సింగరాయకొండ పోలీసులకు ఆదేశాలు వెళ్లడం వెనువెంటనే జరిగిపోయాయి. కానీ వాహనాలకు జరిమానా విధించడం కందుకూరుకు చెందిన నేతలకు చిర్రెత్తించింది. ఇదిలా ఉండగా దేవదాయశాఖ అధికారులు క్రిమినల్ కేసు కట్టేలా ఫిర్యాదు చేయలేదు. మరోసారి దొరికితే క్రిమినల్ కేసు నమోదు చేసి మైనింగ్‌శాఖ అధికారులకు అప్పగిస్తామని పోలీసులు చెబుతున్నారు. దేవస్థానం భూముల్లో టీడీపీ నాయకులు అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ వాటాల విషయమై రోడ్డెక్కారన్న విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వివాదం నేపథ్యంలో మట్టి తవ్వకాలు ప్రస్తుతం నిలిచిపోయాయి. మంత్రి, ఎమ్మెల్యే వర్గీయుల మధ్య తలెత్తిన ఈ వివాదం ఎటు దారితీస్తుందోనని ప్రజలు కూడా ఆసక్తిగా గమనిస్తున్నారు.



సింగరాయకొండ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రెండు టిప్పర్లు(ఫైల్)

కార్యకర్తలకు అండగా జగనన్న

- విద్యాకమిటీ ఎన్నికల్లో పేరెంట్స్‌తో పోటీ చేయించండి
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాలకు చెందిన వారు పార్టీకి అండగా ఉంటే వారందరినీ జగనన్న ఆదుకుంటారని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. స్థానిక కొలుకుల రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలబడిన వారిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరచిపోరని, ఎటువంటి పరిస్థితుల్లోనైనా ఆయన తమకు గుండె ధైర్యాన్ని ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ఆయన ఆందోళనకు దిగారని, ఢిల్లీలో ధర్నా చేసిన ఆయన రాష్ట్ర పరిస్థితి దేశవ్యాప్తంగా తెలిసేలా చేశారని చెప్పారు. తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ వాగ్దానాలు విస్మరించిందని, దీనివలన ప్రభుత్వ నిజస్వరూపం ఏమిటో రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారని అన్నారు. వివిధ శాఖల్లో చిరుద్యోగులుగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ సానుభూతి పరులను అన్యాయంగా తొలగించే చర్యలు చేపట్టారని, తమ పార్టీ వారికి ఎటువంటి పనులు చేయవద్దని అధికారులకు ఆదేశాలు జారీచేశారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ఇసుక, మట్టి తోలకం, రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలించి కోట్లకు కోట్లు దండుకునే దందాలో కూటమి నేతలు ఉన్నారని అన్నారు. ఇటువంటి తరుణంలో ప్రభుత్వానికి ప్రజల కష్టాలు ఏ విధంగా అర్థమవుతాయన్నారు.

విద్యా కమిటీ ఎన్నికల్లో అప్రమత్తంగా ఉండాలి:

వైఎస్సార్ సీపీకి చెందిన వారు ఏదో ఒక పదవిలో కొనసాగుతున్నారని, ప్రజా ప్రతినిధులు, పార్టీ పదవుల్లో ఉన్న వారంతా గురువారం జరిగే విద్యా కమిటీ ఎన్నికల్లో పిల్లల తల్లిదండ్రులతో పోటీ చేయించాలని ఆయన సూచించారు. అసెంబ్లీ ఎన్నికల తరువాత తొలిసారిగా వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పచ్చమూకలకు భయపడి పాఠశాలల వద్దకు వెళ్లకుండా ఆ పదవులను వదలేసినట్లయితే తమ ప్రాబల్యం పడిపోతుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా రాష్ట్ర ప్రజలకు నరకం చూపిస్తున్నారని, ప్రభుత్వం అంటే అందరి కోసం పనిచేసేలా ఉండాలేకానీ ఒకే వర్గానికి కొమ్ముకాసేలా ఉండకూడదన్న విషయాన్ని ఆ ప్రభుత్వం విస్మరించిందన్నారు. రాష్ట్ర ప్రజలు 40 శాతం ఓట్లు వేసి తమ పార్టీకి అనుకూలంగా నిలిచారని, అటువంటి తరుణంలో తామందరం వారికి అండగా ఉండాల్సిన అవసరం ఎంతయినా ఉందని అన్నారు. వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి ఒక్కరూ తమ పట్టును కొనసాగించాలని, ప్రతి సమస్యపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, యేర్వ చలమారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, వివిధ విభాగాల నాయకులు ఐ.వి.సుబ్బారావు, సూరె రమేష్, వై.వెంకటేశ్వరరెడ్డి, కోటిరెడ్డి, ఎం.ఆదిశేషు, వెన్నా మోహన్‌రెడ్డి, అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలపై పెరిగిన దాడులు

- వక్ఫ్ బోర్డ్‌ను నిర్వీర్యం చేయొద్దు
- సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు సత్తార్



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్

ఒంగోలు: కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముస్లింలపై దాడులు పెరిగాయని సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో బుధవారం వక్ఫ్‌బోర్డు బచావో కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లోకి చొరబడి మరీ చంపుతున్నా పార్లమెంట్‌లో ఏ ఒక్క ఎంపీ మైనార్టీ పక్షాన నిలబడి ప్రశ్నించడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డులోని 40 అంశాలను ఏ విధంగా వక్రీకరిస్తారన్నారు. బలహీనమైన సంస్థలను బలోపేతం చేయాలేగాని నిర్వీర్యం చేసే దిశగా పావులు కదపడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. రేపటి పార్లమెంట్ సమావేశాల్లో ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని ఖండించాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మైనార్టీ వర్కర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ మాట్లాడుతూ మన ఓటుతో గెలిచి మనకోసం ప్రశ్నించని ఎంపీలను నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. మైనార్టీ సంఘ ఉపాధ్యక్షులు గౌస్ బాబు మాట్లాడుతూ టీడీపీ కూటమి నాయకులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు మైనార్టీల పట్ల, వక్ఫ్‌బోర్డు పట్ల తమ వైఖరిని స్పష్టం చేయాలన్నారు. ఇంకా పలువురు వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 40 అంశాలను వెనక్కు తీసుకోవాలని, పార్లమెంట్‌లో జరిగే ఓటింగ్‌లో ఆంధ్రా ఎంపీలు పాల్గొనరాదని, వక్ఫ్‌బోర్డును బలోపేతం చేయడంతోపాటు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అసద్, అబ్దుల్‌సత్తార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా అసద్, ఇన్సాఫ్ జాతీయ కమిటీ సభ్యులు అబ్దుల్ సాలార్, మధు, కరిముల్లా, మైనార్టీ వర్కర్ల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, ఉపాధ్యక్షుడు గౌస్‌బాబు, విశ్రాంత ఉద్యోగి ఖాశిం, శర్వాని, హాజీ ఖాసిం సాహెబ్, యువనాయకులు జమీల్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరులో కలెక్టర్ విస్తృత పర్యటన



వసతి గృహంలో భోజనం తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గిద్దలూరు రూరల్: కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ముందుగా నంద్యాల రోడ్డులోని ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను పరిశీలించారు. రైతులు కలెక్షన్ సెంటర్‌కు తీసుకొచ్చే పంట దిగుబడి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కూరగాయల సేకరణ, గ్రేడింగ్ విధానం పై వివరాలు తెలుసుకున్నారు. అక్కడ నుంచి మోడంపల్లె గ్రామ సమీపంలో పట్టుపరిశ్రమ శాఖను పరిశీలించారు. మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం చాకీల గూడ్లను ఆమె పరిశీలించారు. నంద్యాల రోడ్డులో నిర్మాణ దశలో ఉన్న టిడ్కో గృహాలను ఆమె పరిశీలించారు. ఎన్ని గృహాలను నిర్మించారని నగర పంచాయతీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులకు పెట్టే భోజనం తిని పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలను సందర్శించి వైద్య సేవలను గురించి అక్కడ సూపరింటెండెంట్ సూరిబాబును అడిగి తెలుసుకున్నారు. వైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. రోగులకు వైద్యశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులు, ఓపీ వివరాలు, నూతనంగా నిర్మించి వైద్యశాల భవనం విలువ, వైశాల్యం, మందుల వాడకం, పడకల సర్దుబాటు వంటి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ స్థానికంగా ఉన్న సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆమె వెంట మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్‌మీనా, తహశీల్దార్ ఆంజనేయరెడ్డి, నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ శంకర్‌నాయక్, వైద్యులు ఖాదరయ్య, సింధు, ఆసియా, గౌసియా, ప్రవీణ్, అశోక్, ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, హౌసింగ్‌శాఖ అధికారులు, పట్టుపరిశ్రమశాఖ అధికారులు క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.



మల్బరీ పంటను పరిశీలిస్తున్న కలెక్టర్, సబ్ కలెక్టర్

పట్టుసాగు రైతులకు ప్రోత్సాహం అందేలా కృషి

బేస్తవారిపేట: పట్టుసాగు చేసే రైతులకు ప్రోత్సాహం అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. మండలంలోని మోక్షగుండంలోని పట్టు పురుగుల పెంపకం షెడ్లు, మల్బరీ పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మల్బరీ సాగు రైతులు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. కూలీల ఖర్చు అధికంగా మారిందని, కిలో పట్టు ఉత్పత్తికి ప్రభుత్వం ఇచ్చే రూ.50 ఇన్సెంటివ్ అందడంలేదని, సబ్సిడీపై మందులు పంపిణీ చేయాలని రైతులు కోరారు. పట్టుసాగు విధానం, మార్కెటింగ్‌పై రైతులతో మాట్లాడి కలెక్టర్ తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎంపీడీఓ పార్వతి, తహసీల్దార్ పర్వీన్, పట్టుపరిశ్రమశాఖ ఏడీ నారాయణరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో విజయవంతంగా తుంటి ఆపరేషన్



ఆపరేషన్ చేయించుకున్న అంకమ్మతో వైద్య బృందం

మార్కాపురం: మార్కాపురం సర్వజన ఆస్పత్రిలో అరుదైన తుంటి మార్పిడి ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా చేశారు. బుధవారం వివరాలను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీ సావిత్రి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజమన్నార్ తెలిపారు. యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లికి చెందిన జీ అంకమ్మ, శ్రీశైలానికి చెందిన ఎస్ రామకృష్ణలకు తుంటి ఎముక విరిగింది. వీరు జీజీహెచ్‌లో చికిత్స కోసం చేరారు.

అంకమ్మ హైరిస్క్ వ్యక్తిగా గుర్తించి ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆర్థో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీరాంజనేయనాయక్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మనోరంజన్, మత్తు డాక్టర్ గౌతమి ప్రియ, వేణుగోపాల్‌ల సహకారంతో వీరిద్దరికీ ఆపరేషన్ విజయంతంగా చేశారు. ఇదే ఆపరేషన్ కార్పొరేట్ హాస్పిటల్‌లో లక్ష రూపాయలకు పైగా ఖర్చుపెట్టాల్సి ఉంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హాస్పిటల్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వైద్యులను నియమించడంతో ఆధునిక వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. శ్రీశైలానికి చెందిన రామకృష్ణ రోడ్డు ప్రమాదానికి గురవడంతో 108 అంబులెన్స్‌లో తీసుకొచ్చి జాయిన్ చేశారు. ఆపరేషన్ చేసేముందు పేషెంటు తరఫున బంధువులు సంతకం చేయాలి. అయితే వైద్యులు ప్రత్యేకంగా గుర్తించి ఆపరేషన్ చేశారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వారి వెంట డాక్టర్ ఎస్ సుబ్బారెడ్డి, నర్సింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పొగాకు గరిష్ట ధర రూ.358

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో మంగళవారం నిర్వహించిన పొగాకు వేలంలో గరిష్ట ధర కేజీ రూ.358 పలికిందని టుబాకో బోర్డు ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాలకు 10,350 బేళ్లు రాగా 8,656 కొనుగోలయ్యాయని, వ్యాపారులు వివిధ కారణాలతో 1,684 బేళ్లు తిరస్కరించారని వెల్లడించారు. ఒంగోలు(పేర్నమిట్ట), వెల్లంపల్లి, ఒంగోలు, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 125వ రోజు వేలానికి 5,331 బేళ్లు రాగా 4,600 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 731 బేళ్లను తిరస్కరించారు. ఆయా వేలం కేంద్రాల్లో గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.205, సరాసరి ధర రూ.299.53 పలికింది. అలాగే కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 119వ రోజు వేలానికి 5,019 బేళ్లు రాగా 4,056 కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 963 పొగాకు బేళ్లను తిరస్కరించారు. మొత్తం వేలం కేంద్రాల్లో గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.302.16 పలికింది.

క్రీడలతో మానసికోల్లాసం

- ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్



క్రీడలను ప్రారంభిస్తున్న డైరెక్టర్ నిరంజన్

పెద్దదోర్నాల: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో బాలికల అథ్లెటిక్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాలన్నారు. గెలుపోటములు సర్వసాధారణమని, ఓటమి గెలుపునకు తొలిమెట్టు అని, ఓడినంత మాత్రాన నిరుత్సాహానికి గురి కాకుండా పోటీల్లో పాల్గొనాలన్నారు. గెలిచిన వారిని అనంతపురం స్పోర్ట్స్ అకాడమీకి పంపిస్తామని చెప్పారు. రీజనల్ డైరెక్టర్ నాగరాజు, ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి, వంశీ, గోపాల్, వేమయ్య, రాజరత్నం పాల్గొని విజేతలకు మోడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

పథకం డబ్బులు వేస్తామంటూ.. ఉన్నవి లాగేశారు!

పొదిలి: అమ్మఒడి పథకం డబ్బులు మీకు రాలేదా..? అవి వెంటనే మీ ఖాతాకు పంపిస్తామంటూ ఓ యువకుడిని సైబర్ నేరగాళ్లు మోసగించి బ్యాంక్ ఖాతాలో ఉన్న సొమ్మును సైతం కాజేశారు. ఈ సంఘటన పొదిలిలోని పిచ్చిరెడ్డితోట కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. బుడంగుంట్ల రామకృష్ణ, అతని స్నేహితుడు రమేష్ పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఉండగా రామకృష్ణకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. తాము సచివాలయం నుంచి మాట్లాడుతున్నామని, మీకు పథకాలు అన్నీ అందుతున్నాయా అని అడిగారు. దీనికి సమాధానంగా రామకృష్ణ మాకు అన్ని పథకాలు అందుతున్నాయని చెప్పాడు. అమ్మ ఒడి పెండింగ్ డబ్బులు ఇప్పుడే వేస్తాం .. మీ ఫోన్‌పే ఖాతా ఓపెన్‌లో ఉంచుకోవాలని నమ్మబలికారు. వారి మాటలు నమ్మిన రామకృష్ణ ఫోన్ పే యాప్ ఓపెన్ చేసి ఉంచాడు. కొంత సమయానికి పథకం డబ్బులు ఖాతాలో చేరలేదు సరికదా ఖాతాలో ఉన్న డబ్బులు కూడా లాగేసుకున్నారు. మోసపోయానని గ్రహించిన రామకృష్ణ తన స్నేహితుడు రమేష్‌తో కలిసి నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై కోటయ్య స్పందిస్తూ.. బ్యాంకు ఖాతాలో రూ.22 వేల నగదు మాయంపై ఫిర్యాదు అందిందని, సైబర్ క్రైం విభాగాన్ని సంప్రదించాలని సూచించామన్నారు. ఖాతా నుంచి మాయమైన నగదు ఫ్రీజ్ అయితే దానిని రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

కొనకనమిట్ల: బైక్‌పై వెళ్తున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సాయంత్రం కొనకనమిట్ల మండలం ఎదురాళ్లపాడు సమీపంలో మార్కాపురం–పొదిలి రహదారిపై చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని వద్దిమడుగు గ్రామానికి చెందిన భూదాల నాగరాజు వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై కొనకనమిట్ల వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న సమయంలో ఎదురాళ్లపాడు సమీపంలో వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. బైక్ నుంచి ఎగిరిపడిన నాగరాజు తలకు బలమైన గాయమై సంఘటనా స్థలంలోనే స్పృహతప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న నాగరాజు బంధువులు పొదిలి వైద్యశాలకు తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు.



తీవ్రంగా గాయపడిన నాగరాజు



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య



తనకు న్యాయం చేయాలంటూ బైఠాయించిన మృతుడి తండ్రి అహమద్

యువకుడి దారుణ హత్యపై ముస్లింల ఆగ్రహం

- చీరాల పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత
- నిందితులను వెంటనే శిక్షించాలని బంధువుల ఆందోళన
- హంతకులు ఎక్కడున్నారో పోలీసులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపణ
- బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని జేసీ హామీ
- ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యతోపాటు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



హతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ముస్లింలు

చీరాల: బాపట్ల జిల్లా చీరాలలో మైనార్టీ యువకుడు సయ్యద్ ఆరీఫ్ (18) ను అత్యంత దారుణంగా కత్తులతో పొడిచి చంపిన నిందితులను కఠినంగా శిక్షించాలని ముస్లిం మైనార్టీలు బుధవారం గడియార స్తంభం సెంటర్‌ను చుట్టుముట్టారు. కారుకు సైడ్ ఇవ్వలేదని అతి చిన్న కారణంతో వేటకొడవళ్లతో నరికి చంపిన హంతకులను అరెస్ట్ చేయకపోవడంతో ముస్లింలు ప్రభుత్వం తీరు, పోలీసులపై మండిపడ్డారు. నియోజకవర్గంలోని ముస్లింలు అంతా ఏకమయ్యారు. దీంతో చీరాలలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. సీఎం చంద్రబాబునాయుడు చీరాల పర్యటనకు వస్తున్నారని, ఈ పర్యటనలో నిరసన తెలిపేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. చివరకు పర్యటన రద్దు కావడంతో గడియార స్తంభం కూడలిని చుట్టుముట్టారు. జిల్లా పోలీస్ యంత్రాంగం పలుమార్లు చర్చలు జరిపినా ముస్లింలు పోలీసుల మాట వినలేదు. చంపింది ఎవరో పోలీసులకు పూర్తిగా సమాచారం ఉన్నప్పటికీ అరెస్ట్ చేయలేదన్నారు. స్వయంగా కలెక్టర్ వెంకట మురళినే హతుడు ఆరిఫ్‌ను 108 ద్వారా ప్రభుత్వ వైద్యశాలకు తరలించేందుకు సహకరించినా అప్పటికే ప్రాణాలు పోయాయన్నారు. ఇంత బహిరంగంగా జరిగిన ఈ హత్యలో దోషులెవరో పూర్తి వివరాలను బాధిత కుటుంబం పోలీసులకు అందించింది. స్టువార్టుపురం నుంచి బాపట్ల తరలివెళ్లి అక్కడ నివాసముంటున్న కొన్ని కుటుంబాలకు చెందిన నలుగురు యువకులు ఈ హత్యలో పాల్గొన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం ఉన్నా ఇంకా గాలిస్తున్నామని, త్వరలో అరెస్ట్ చేస్తామని చెబుతున్నారే తప్ప హంతకులు ఎక్కడున్నారో పోలీసులకు తెలుసన్నారు. వెంటనే వారిని అరెస్ట్ చేసే వరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రభుత్వం, పోలీసులకు అల్టిమేటం జారీ చేశారు.



పోలీసులు, ముస్లింల మధ్య వాగ్వాదం

హతుడి చెల్లెలికి ఉద్యోగం ఇస్తాం

బాధితుడు కుటుంబానికి అన్ని విధాలా ఆదుకుంటామని జాయింట్ కలెక్టర్ సుబ్బారావు హామీ ఇచ్చారు. ఆందోళన చేస్తున్న ప్రాంతానికి వచ్చిన ఆయన ముస్లిం మైనార్టీలతో చర్చలు జరిపారు. ఈ హత్య విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందని, నిందితులను ప్రత్యేక నిఘా పెట్టి త్వరలోనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటుందన్నారు. కుటుంబంలోని హతుడు ఆరీఫ్ చెల్లెలికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేస్తామని ప్రకటించడంతో ముస్లింలు ఆందోళన విరమించారు. ముఖ్యంగా నిందితులను ప్రత్యేక కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

లాఅండ్‌ఆర్డర్ విఫలం

మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలమైందని, పోలీస్ వ్యవస్థ నిర్వీర్యమైందన్నారు. హతుడి కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాడతానన్నారు. గడియార స్తంభం సెంటర్‌లో ఆందోళన చేస్తున్న ముస్లిం మైనార్టీలకు మద్దతుగా బైఠాయించారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు తదితరులు ఆరిఫ్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కాగా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలో ఆరీఫ్ మృతదేహాన్ని పరిశీలించి హతుడి తండ్రి అహ్మద్‌ను పరామర్శించారు. హంతకులు ఎంతటి వారైనా శిక్షిస్తామని హామీ ఇచ్చారు.

నా కొడుకును చంపి కేసు పెట్టొద్దని బెదిరించారు

నా కొడుకునే అత్యంత పాశవికంగా చంపిన హంతకుడికి తమ్ముడు వరుస అయ్యే వ్యక్తి నా వద్దకే వచ్చి కేసు పెట్టవద్దంటూ భయపెట్టాడు. డిగ్రీ చదువుకునే నా కొడుకే నాకు ఆధారం. అతనిపైనే ఆశలు పెట్టుకున్నాను. ఆర్మీకి వెళ్లే పట్టుదలతో కాలేజీ పూర్తయిన తర్వాత జిమ్‌కు వెళ్లి రాత్రి 9 గంటలకు ఇంటి వస్తుంటాడు. గొడవలకు వెళ్లే వ్యక్తి కాదు. తన స్నేహితుడితో కలిసి ఇంటికి వస్తున్న సమయంలో కారులో వచ్చిన యువకులు గొడవ పెట్టుకుని అకారణంగా కత్తులతో పొడిచి చంపేశారు. తోటి స్నేహితుడు ఫోన్ చేసి ఇద్దరు హాస్పిటల్‌లో ఉన్నామని చెబితే అక్కడకు వెళితే నా కొడుకు మార్చురీలో ఉన్నాడు. అకారణంగా నా కొడుకును హత్య చేశారు. హంతకుడి తమ్ముడు నా ఇంటికి వచ్చి 'జరిగింది చిన్న విషయమే కదా... పెద్దది చేయకండి.. కాదని మాకు అడ్డంగా వస్తే ఇంట్లో అందరినీ చంపేస్తామని' బెదిరించారు ఆ ఫొటోలను టూటౌన్ సీఐకు పంపించాం. ఈపూరుపాలెంలో ఉండే అతడిని ఇప్పటికి వరకు అరెస్ట్ చేయకపోవడం పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనం. నా కొడుకును చంపిన వారిని అరెస్ట్ చేసి మాకు న్యాయం చేయాలి.

– హతుడు ఆరిఫ్ తండ్రి సయ్యద్ అహ్మద్

కంభం చెరువు అభివృద్ధికి కృషి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



కంభం చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్

కంభం: చారిత్రాత్మక కంభం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుంటానని కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాతో కలిసి కంభం చెరువును కలెక్టర్ పరిశీలించారు. చెరువు చరిత్ర, చారిత్రక నేపథ్యం గురించి కలెక్టర్‌కు ఇరిగేషన్ డీఈ జాకీర్ అహ్మద్ వివరించారు. 5,917 ఎకరాలకుపైగా విస్తీర్ణం కలిగిన కంభం చెరువు కింద సుమారు 7 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. చెరువులో 2.952 టీఎంసీల నీటిని నిల్వ చేసుకోవచ్చని ప్రస్తుతం 0.182 టీఎంసీల నీరు ఉందని పేర్కొన్నారు. చెరువు తూముకు మరమ్మతులు పూర్తి చేశామని, చెరువు ఆయకట్టును సుందరీకరించేందుకు 67 లక్షల రూపాయల అంచనా వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాని తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మరింత మంది పర్యాటకులను ఆకర్షించేలా కంభం చెరువును అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ మస్తాన్ వలి, ఇరిగేషన్ ఏఈ వెంకట్, ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో 'అద్దె ఇంటి' దొంగ?

ఒంగోలు టౌన్: నగరంలోని అంకమ్మపాలెం వీధిలో ఇల్లు అద్దెకు కావాలని వచ్చి, ఇంటి యజమానురాలైన వృద్ధురాలిపై దాడి చేసి, ఆమె మెడలోని బంగారు నగలను దోచుకెళ్లిన దొంగను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుడు పాత నేరస్తుడు కాగా గతంలో అనేక దొంగతనాలకు పాల్పడి ఇటీవలే జైలు నుంచి బయటకు వచ్చాడని, వచ్చీ రాగానే మళ్లీ దొంగతనాలు మొదలుపెట్టినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. అంకమ్మపాలెంలో పటపంజుల సుగుణ అనే వృద్ధురాలికి చెందిన ఇంటికి టులెట్ బోర్డు ఏర్పాటు చేశారు. దాని మీద ఉన్న మొబైల్ నంబర్‌కు ఒక వ్యక్తి ఫోన్ చేసి ఇల్లు అద్దెకు కావాలని అడిగాడు. ఇల్లు చూసుకుని నచ్చింది, మళ్లీ వస్తానని చెప్పి వెళ్లాడు. పొదిలి మండలానికి చెందిన తాను జడ్జి డ్రైవర్‌గా పనిచేస్తున్నానని నమ్మబలికాడు. మరుసటి రోజు అడ్వాన్స్ ఇచ్చేందుకు వచ్చినట్లు నటిస్తూ ఒంటరిగా ఉన్న సుగుణమ్మపై దాడి చేశాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆమె కళ్లు బైర్లు కమ్మి పడిపోయింది. ఆమె మెడలోని 9 సవర్ల బంగారు చైను, చేతిలో ఉన్న ఐ ప్యాడ్ తీసుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు గత రెండు రోజులుగా పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచారు. బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారిస్తున్నట్లు సమాచారం.

ఏడేళ్లకే నూరేళ్లు నిండాయి

అద్దంకి రూరల్: ముందు వెళుతున్న బస్సును ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో కుమారుడు మృతి చెందగా తండ్రికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అద్దంకి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం రాత్రి ఇంకొల్లు నుంచి అద్దంకి బయలుదేరింది. మార్గ మధ్యంలో అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డులో గరటయ్య కాలనీ సమీపంలోకి రాగానే కాలనీకి చెందిన రాఘవ అతని కుమారుడు మణికంఠ (7) బైక్‌పై స్థానిక ప్రయివేటు వైద్యశాలలో ఉన్న అమ్మమ్మ చూసేందుకు బైక్‌పై వెళుతున్నారు. ఈ క్రమంలో ముందు వెళుతున్న బస్సును ఢీకొట్టారు. ఈఘటనలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందగా, రాఘవకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.



బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి, బంధువులు

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో..
- వ్యవసాయం కోసం తెలిసిన వారి దగ్గర పెద్ద మొత్తంలో అప్పు





మృతదేహంపై పడి రోదిస్తున్న సోదరుడు
ఇన్‌సెట్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ కోటేంద్ర (ఫైల్)

పెద్దదోర్నాల: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ సంఘటన బుధవారం శ్రీశైలం రహదారిలో తీగలేరు కెనాల్ ప్రాంతంలోని ఓ వ్యవసాయ భూమిలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. పెద్దదోర్నాల మండలం జమ్మిదోర్నాలకు చెందిన వద్దెళ్లి కోటేంద్ర(28)కు సొంతగా రెండు ఎకరాలు భూమి ఉంది. దీంతో పాటు 16 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో పంటల సాగు కోసం పెట్టుబడి పెట్టేందుకు అప్పు చేశాడు. దీనికి తోడు మండలంలో సకాలంలో వర్షాలు కురవకపోవటంతో పంటల సాగుకు అదును తప్పుతోందని ఆందోళన చెందాడు. అలాగే కొద్ది రోజుల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో పంచాయితీ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. బుధవారం ఉదయాన్నే బయటకు వెళ్తున్నానని తల్లిదండ్రులు యలమందయ్య, రవణమ్మకు చెప్పిన కోటేంద్ర తీగలేరు కెనాల్ సమీపంలో ఉన్న పొలాల వద్దకు వెళ్లాడు. తన ద్విచక్రవాహనాన్ని సంఘటనా స్థలానికి సమీపంలో ఉంచి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతునికి భార్య గంగ, కుమార్తెలు కౌశిక, మౌనిక ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై అంకమ్మరావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బోరున విలపించిన సోదరుడు

ఉరి వేసుకుని అన్న ఆత్మహత్యకు పాల్పడటంతో అతడి మృతదేహంపై పడి తమ్ముడు రోదించిన తీరు అందరి హృదయాలను కలిచివేసింది. 'అన్నా మమ్మలందరినీ అన్యాయం చేసి నువ్వు ఒక్కడివే వెళ్లి పోయావా' అంటూ మృతుడి తమ్ముడు చిన్న కోటేశ్వరరావు బోరున విలపించాడు.

12 నుంచి పారిశ్రామిక మెళకువలపై శిక్షణ

ఒంగోలు టౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి అవసరమైన మెళకువలపై నిరుద్యోగ యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జె.రవితేజ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన యువతకు వ్యాపార నిర్వాహణా శక్తి సామర్థ్యంపై ఈ నెల 12 నుంచి 8 రోజులపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మార్కెటింగ్, కొనుగోలు, స్టాక్ నియంత్రణ, ఖాతా పుస్తకాల నిర్వహణ, వ్యాపార ప్రణాళిక, ఉత్పాదక అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించే ఈ శిక్షణకు 8వ తరగతి పాస్ లేదా ఫెయిల్ , 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులని స్పష్టం చేశారు. వివరాలకు 9160797311ను సంప్రదించాలని కోరారు.

505 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన బియ్యం లారీతో అధికారులు

బేస్తవారిపేట: లారీలో అక్రమంగా తరలిస్తున్న 505 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం బేస్తవారిపేట జంక్షన్‌లో సీజ్ చేశారు. కంభం మండలంలోని యర్రబాలెం పరిసర ప్రాంతాల్లో సేకరించిన 505 బస్తాల రేషన్ బియ్యాన్ని నెల్లూరుకు తరలిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు బేస్తవారిపేట జంక్షన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అనిల్‌కుమార్, విజిలెన్స్ ఎస్సై నాగేశ్వరరావు తనిఖీలు చేపట్టారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న 505 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యాన్ని కంభం ఎంఎల్ఎస్ పాయింట్ గోడౌన్‌కు తరలించి, లారీని బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లు స్వాధీనం

టంగుటూరు: ఓ కోల్డ్ స్టోరేజీ నుంచి ట్రాక్టర్లో అక్రమంగా తరలిస్తున్న పొగాకు బేళ్లను టుబాకో బోర్డు విజిలెన్స్ అధికారులు రెండు రోజుల క్రితం స్వాధీనం చేసుకోగా బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అందిన సమాచారం మేరకు.. టంగుటూరులోని ఓ కోల్డు స్టోరేజీ నుంచి ట్రాక్టర్‌లో 15 పొగాకు బేళ్లను వేలం కేంద్రానికి తీసుకురాకుండా జమ్ములపాలెం వైపు తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు ఉప్పందింది. అప్పటికే మాటు వేసి ఉన్న అధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. పొగాకు బేళ్లను స్థానిక వేలం కేంద్రానికి తరలించి డ్రైవర్‌ను విచారిస్తున్నారు. పొగాకు బేళ్ల విలువ తెలియాల్సి ఉంది.

ఘనంగా దేవర కొలుపులు



నాగార్పమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న మనపాటి వంశస్తులు

ఒంగోలు సిటీ: మండల పరిధిలోని కరవది గ్రామంలో కొత్తగా నిర్మించిన 'మనపాటి' వారి దేవర నాగార్పమ్మ తల్లి కొలుపులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 11వ తేదీ వరకు కొలుపులు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కరవదిలో దేవరింటి నుంచి నాగార్పమ్మతల్లి ప్రతిమ, బొళ్లావులను మేళతాళాలతో ఊరేగించుకుంటూ మనపాటి కుటుంబ సభ్యులు, ఆడపడుచులు, బంధువులు కొత్తపట్నం సముద్రస్నానానికి బయలుదేరారు. సముద్రపు ఒడ్డున నాగార్పమ్మతల్లి ముగ్గు వేసి మనపాటి కుటుంబ సభ్యులందరూ ప్రత్యేక పూజలు నిర్వహంచారు. 8వ తేదీ పుట్ట, జలధి నివాసం, మైలతుడుపు, అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు, 9వ తేదీ నాగార్పమ్మతల్లి మందిర ప్రవేశ కార్యక్రమం, కొమ్మాలబంతి, 10వ తేదీ ఆడపడచుల పొంగళ్లు, జమ్మిచెట్టు వద్ద నాగార్పమ్మ తల్లి కథ కార్యక్రమం, 11వ తేదీ పట్టాలు ఎక్కువ, దీవెన బండారు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.